# ఫొటో

శ్రీ కె: జానకిరాం పట్నాయకులు

బి. ఎల్. పరీక్షఫలితాలు తెలిసిన తరువాత మురహరిరావు కొన్నాళ్ళు విశ్రాంతి పొందాలని స్వగ్రామం చేరుకున్నాడు. అది పల్లెటూరు. అయినా అచ్చటి వాతావరణం ప్రకృతి, అమాయకపుప్రజలు, చదువులువల్ల మొఱడుబారిన ఆతని హృదయానికి చాలా శాంతినిచ్చాయి.

అది వేసవికాలం. మండు ఎండలు. అయినా అగ్రామం సముద్రతీరాన ఉండడం చాత మంచిచల్లదనానికి చోటునిస్తూంది.

ఒదినం మూడుగంటలయాక మురహరిరావు హార్మోనియంమీద ప్రఖ్యాత సినీమా దేవికారాణి పాడినపాట "మైబనకీచిడియా బనకర్ బన్ బన్ డోలూం[illegible]న్నాడు. అది వినడానికి ఎంతోహాయిగాను, ఇంపుగాను ఉంది.

ఆస్వరాలు, ఎదురింటి అమ్మాయి సరళ చెవుల్లోపడ్డవి. ఆమె గదిలోనికివచ్చి విలుచుంది. మురహరిరావు తలయెత్తి ఆమెను చూచినాడు. నాలుగుకండ్లూకలుసుకున్నాయి' సరళ చూపుల్ని దిగునకు వాల్చేసింది. హార్మోనియం ఆపేసి "ఏం సరళా! ఈలా వచ్చావు?" అన్నాడు. చిన్న నవ్వుతో "ఉత్తినే! పాట విందాంవని" అంది. "ఆలా కూచో" అనికుర్చీ చూపించాడు. "అక్కర్లే" అని చాపమీదకూచొని "పాట ఎంతోహాయిగాఉంది! ఎందులోంది?" అని ప్రశ్నించింది.

"హిందీ సినీమాలోంది" అని తిరుగా దాన్ని పూర్తిగావాయించి వినిపించాడు.

పాట అయిపోయాక "వెళ్తొస్తాను" అని లేచి, ఓసారి అతని ముఖంలోనికిచూచి తల దించుకొని నడకసాగించింది.

ద్వారంవఱకూ వెళ్ళి ఆమెను సాగనంపాడు

ఆరాత్రి మురహరిరావునకు నిద్దరవట్టడం లేదు. మాటిమాటికీ సరళ మోహన రూపం కండ్లకుకడుతూ ఉండేది. ఎంత యత్నించినా ఆమెను మర్చిపోలేకుంటున్నాడు. వివిధాలోచనలు తలలో తిరిగి పోతున్నాయి!

"సరళ ఎంత చక్కంది! పల్లెటూరి పడుచుల్లోకూడ ఇల్లాంటి ముగ్ధమోహనవతులుంటారా?....ఆ మార్దవ్యం, ఆ నునుసిగ్గు, ఆ కన్నుల అందం, ఎవరి హృదయాల్లో నాటుకుపోవు?....చిన్న తనంలో నా దగ్గర ఎంతో విచ్చలవిడిగా సంచరించేది? ఆ విచ్చలవిడి, ఆ స్వాతంత్ర్యం ఈనాడెక్కడికి పోయాయో? ఇప్పుడు పదిహేనవఏడేనా? ఇంతలో ఎంతమార్పు? ఎంతసిగ్గు? ఎంత జంకు? ఎంతవినయం? ఎంతమార్దవ్యం? ఎంత మర్యాద?....ఆహా! ఈరత్నం ఎవరి చేతుల్లోపడ్డానికి ఉందోకదా? అతడెల్లాంటి భాగ్యశాలో కదా?"

• • •

మూడుమాసాలు గడిచిపోయినాయి! మురహరిరావుకూ, సరళకూ ప్రగాఢంపైన స్నేహం అలుముకుంది! ఒకరినొకరు చూచుకోకుండా ఒకదినంపైనా గడపలేరు.

సరళ మృదుహృదయంలోకూడా ఏవేవో మధురభావాలు పొడకడుతూండేవి. "అతనెంతపవిత్రహృదయుడు? ఆ స్నేహం, ఆ మాటలు, ఆ విజ్ఞానం అందరికీ ఉంటాయా? చిన్ననాడు అంతకలిసి మెలిసి తిరిగినా, ఈనాడాతడు నాపట్ల ఎంతజాగ్రతగా ప్రవర్తిస్తుంటాడు? ఆ నిష్కల్మషహృదయం ప్రతీవారికుంటాయా?....ఏమోగాని ఆతణ్ణిమనసుతీరా చూడ్డానికి జంకు కలుగుతూంటుంది! ఆ సిగ్గు ఎక్కణ్ణుంచి వచ్చిపడుతుందో తెలీదు! కానీ హృదయం ఎల్లప్పుడూ అతనిదగ్గరే ఉండిపోమని ఆరాటపెడుతూంది! కాని ఏలా అవుతుంది? నావంటిదాన్నా అతనికి....? అదియాస! ఆతనెక్కడ? నేనెక్కడ? ఏదో చిన్నతనపు స్నేహితురాలని ఆలా ఆదరిస్తున్నాడు గాని....? అబ్బా! ఆమాట తలంచుకుంటే హృదయంమీద వేయిగొడ్డలిపెట్టులుపెట్టినట్లవుతుంది! ఏం చెయ్యడం? కాదు! ఈ విషయంలో ఆతణ్ణి అడిగిచూస్తాను? తప్పేముంది? సందేహనివృత్తిచేసుకుంటాను! ....అయితే ఆతనేలా తలుస్తాడో? నీచురాలిగా, పలుపుగా అర్థంచేసుకుంటాడో ఏమో? ఛీ! అతనాలా తలంచుకుంటే ఇక నేలా నా ముఖాన్ని అతనికి చూపిస్తాను?....ఉత్తి భ్రమ! తీరనికోరిక!"

ఆ యమరనిరాశ ఆమె తీయని తలపుల్ని అణగద్రొక్కేసింది!

తుదకు ఎవరి ఆకాంక్షలు వాళ్ళ మనస్సుల్లోనే ఉండిపోయినాయి! ఎవరి సందేహాలు వాళ్ళహృదయాల్లోనే పదిలపడిపోయినాయి! వాటిని ఎవరూ నివృత్తిచేసుకోలేదు!

మురహరిరావు వివాహం మహావైభవంగా జరిగిపోయింది. కాని అతనికి మాత్రం అందులో గొప్పలోపం కనిపించింది. ఆలోపం ఆతని జన్మలో మరి పూర్తికాదని నిశ్చయించుకున్నాడు. అయితే ముదుసలి తల్లిమాటకూ, ముఖ్యంగా కాలానికి కట్టుబడిపోయి ఆ వివాహానికి తల ఊపేసినాడు.

ఇక సరళ! ఆమెస్థితి వర్ణనాతీతం! ఎంతోకాలంనుంచి గడించుకువచ్చిన అపారధనాన్ని, తనుచూస్తూండగా ఎవరోవచ్చి శాశ్వతంగా ఎత్తుకు పారిపోయినట్లయితే మనస్సెంత అలమటించి పోతూందో అంతకన్నా అధికంగా ఆమె మనస్సు అలమటించిపోయింది! అయితే ఆమెచేసేదేముంది?

వివాహం జరిగిన పదోనాడు, మురహరిరావు ఒంటరిగా గదిలో కూచొని ఏదో తలపోస్తున్నాడు! ముఖభావం చూస్తే ఆతని మనస్సు తుపానుతోఉన్న సముద్రంలా ఉన్నట్టు ధూపిస్తుంది.

అప్రయత్నంగా ఎదుటనున్న నిలువుటద్దంలో చూచినాడు. అందులో సరళ రూపం కనబడ్డది. త్రుళ్ళిపడి వెనక్కుతిరిగి చూచినాడు. ఆముఖంలో పూర్వపుకళలేదు. ఆనందరేఖలు లీనమైపోయినాయి! ఆ సౌందర్యం ముకుళితపద్మంలాఉంది!

కాస్సేపటివరకూ ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

తుదకు మురహరిరావే అతికష్టంమీద "సరళా!" అని పలుకరించినాడు. ఆశబ్దంలో గద్గదిక స్పష్టంగా వినవొస్తూంది.

జవాబుగా ఆమె అతణ్ణి తేరిపారజూచింది. ఆ కన్నులు, మంచుతో తడిసిన పద్మదళాల్లా ఉన్నాయి: కాటుక పూసినట్లుగా రెప్పల దిగువభాగం నల్లనిఛాయలు కనబడుతూన్నాయి: లేని వికాసంతెచ్చుకొని అతనికి సమీపంలోఉన్న కుర్చీలో కూచుం...

"పెండ్లి బహుమానం ఏదీ?" అని అడిగింది.

"పెండ్లి బహుమానంవా!" అని ఎండుబారిన హృదయంతో తిరుగు ప్రశ్న వేసినాడు

"అవును!" అంది దృఢంగా.

"ఏం కావాలి?" అన్నాడు ఆత్రుతగా.

"నేకోరింది యిస్తారా?" అంది ఆశాంతగా.

"తప్పక!" అన్నాడు నిశ్చలమైన మనస్సుతో.

"అయితే మీ 'ఫొటో' కావాలి" అంది యాచనా భావంతో.

"ఫొటో కావాలా?" అన్నాడు ఆశ్చర్యంగా,

"ఔను" అంది దృఢంగా.

ఆల్బంలోనుంచి ఐదారు ఫొటోలుతీసి ఆమె ముందుంచినాడు. తనకు నచ్చింది ఒకటితీసుకొని, వేదనా సూచకమైన నిట్టూర్పువిడిచి ఆమె వెళ్ళిపోయింది:

నీరు నిండిన కండ్లతో ఆమె పోయిన దిక్కునకే చూస్తూ ఆతడుండిపోయినాడు.

* * *

చూస్తూండగానే పదివసంతాలు తిరిగిపోయినాయి. మురహరిరావు నేడు జిల్లా మెజిస్ట్రేటు! ఈ ఉన్నతోద్యోగంలోనికి వచ్చిన తరువాత ఆతని విచారణకు ఓఖూనీకేసువచ్చింది: అదే మొదటిది!!

విచారణసమయంలో ముద్దాయి ఈలా చెప్పినాడు.

"ఈ విషయంలో నేను వాదించను. నాకే ప్లీడరూ అవసరంలేదు. ఖూనీచేసినట్టుగా నాకు నేనైయే ఒప్పుకుంటున్నాను...నాభార్యా ప్రవర్తన నాకు హృదయవిదారకమైపోయింది. ఆమెను వివాహం ఆడి ఎనిమిది సంవత్సరాలైంది. ఎంచేతనో కాని పదిహేడు సంవత్సరాలవరకూ ఆమెకు వివాహం లేకుండాలేదు. కన్నవారడిగితే వివాహం కాలేదు. కన్యాత్వంలోనే ఉండిపోతానని జవాబిస్తుండేదట: కాని నా అదృష్టానో, దురదృష్టానో నాతో వివాహానికి అంగీకరించింది: అయితే వివాహం అయిన ఈకాలంలో ఆమె దాంపత్యధర్మానికి కట్టుబడ్డ సానుభూతినే నాపట్ల చూపుతుండేది కాని సతీధర్మం, అచరించడంలేదు: నాశక్తినంతా వినియోగించి ఆమెను నాయందనురక్తను చేసుకోవడానికెంతో ప్రయత్నించాను. కావలసినంత ధనాన్ని ఖర్చుపెట్టినాను. కాని లాభంలేకపోయింది. నాకు కావలసిన ప్రేమ, అభిమానం, ప్రణయం ఆమెలో లభించింది కాదు: కారణం తెలియక తికమకలు పడ్డాను. నయభయాలుచూపి అడిగినాను. ఏదో స్వల్ప సాకులు కనబర్చి తప్పించుకుండేది: కాని పట్టుకు దొరికేదికాదు:

తుదకు, అసలు కారణం గోచరించింది! ఓనాడు పొరుగూరికిపోయి అర్ధరాత్రికి ఇంటికి చేరుకున్నాను. నేనలావస్తానని ఆమెకు తెలీదు! నౌకరీ కుఱ్ఱాడు తలుపుతీశాడు: సరాసరి పడక గదిలోనికిపోయాను! ఆమె గాఢనిద్రలోఉంది: ఆమె రెండు చేతులూ గుండెలకానుకొని ఉన్నాయి: వాటిమధ్య ఓ 'ఫొటో' ఉంది. దాన్ని మెల్లగా తీసిచూసినాను! ఎవరిదో తెలిసిందికాదు. నా కన్నులు గిఱ్ఱున తిరిగిపోయినాయి: ఆ "ఫొటో" క్రింద 'హృదయేశ్వరా!' అని వ్రాసిఉంది: అది ఆమె దస్తూరీస్తే!

నాలో ఓ పిశాచం తాండవించింది. రక్తం ఉడుకెత్తిపోయి మెదడులో ప్రవేశించింది. ఇన్నూమిన్నూ కనిపించింది కాదు. పరుపుదిగువనున్న బాకు చేతిలోనికి వచ్చింది, మరుక్షణంలో ఆపతితురాలి శరీరం రక్తంలో దొర్లిపోయింది!...అయితే ఆమె పతితురాలు కాదని నా అంతర్వాణి ఇపుడు చెబుతూంది! ఆమె 'హృదయేశ్వరుడే' ఆమెను వివాహమాడినా, లేక నేనామెను వివాహమాడకపోయినా ఆమె పవిత్రురాలుకాదు పతివ్రత అయేఉన్న...!

ముద్దాయిమాటలు ఒక్కొక్కటీ మురహరిరావు హృదయానికొక్కొక్క పిడుగు తాకినట్లయినాయి: శరీరం యావత్తూ చెమట పట్టిపోయింది: గుండెల్లో దడబయల్దేరింది: అతికష్టంగా మనస్సు పదిలపర్చుకొని, ఆఫొటో అడిగితీసుకొని, చూచినాడు: పెండ్లి బహుమానంగా తాను [illegible] wer "ఫొటో"!